HICON SERIES

CLASS 2 TERM-1

# తెలుగు భారతి

LESSON 4






CLICK HERE TO ACTIVATE

LESSON

# 4. సూర్యుడు - చంద్రుడు



ఉదయాన సూర్యుడు తూర్పు దిక్కున మనకు కనిపిస్తాడు. ఉదయించే సూర్యుడు చాలా పెద్దగా, ఎర్రగా, గుండ్రంగా ఉంటాడు. ఉదయం సూర్య కిరణాలు చాలా ఏటవాలుగా పడతాయి. మన ప్రతిబింబం పెద్దదిగా కనిపిస్తుంది. ఉదయం ఎండ తీవ్రత తక్కువగా ఉంటుంది.




మధ్యాహ్నం సూర్యుడు మన తలమీదికి వస్తాడు. సూర్యుని కిరణాలు నిట్టనిలువుగా పడతాయి. అందుకే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో మన ప్రతిబింబం చాలా చిన్నదిగా కనబడుతుంది.



సాయంకాలం సూర్యుడు పడమర దిక్కుగా వెళ్ళి అస్తమిస్తాడు. సూర్యుడు మళ్ళీ పెద్దగా, ఎర్రగా, గుండ్రంగా కనబడతాడు. సూర్య కిరణాలు మళ్ళీ చాలా ఏటవాలుగా పడతాయి. ఎండ తీవ్రత తక్కువగా ఉంటుంది. మన ప్రతిబింబం అప్పుడు కూడా చాలా పెద్దదిగా కనబడుతుంది. ఉదయం నుండి సాయంకాలం వరకు మధ్య ఉన్న కాలాన్ని పగలు అంటారు. మనం సూర్యుని నుండే వెలుతురునూ, వేడిమిని పొందుతున్నాము.

సూర్యుని వేడిమి వలననే నీరు ఆవిరిగా మారి పైకిపోతుంది. మేఘాలుగా ఏర్పడతాయి. మేఘాలు చల్లబడినపుడు వర్షం కురుస్తుంది. పంటలు పండుతాయి. ఆహారం లభిస్తుంది. అప్పుడే జంతువులు, పక్షులు, మానవులు అంటే సర్వజీవులు ఆనందంగా ఉంటారు. కనుక సూర్యుడు లేనిదే ఈ ప్రపంచం లేదు. మానవజాతి మనుగడ లేదు.





రాత్రిపూట ఆకాశంలో అనేక నక్షత్రాలు కనిపిస్తాయి. వాటి మధ్య చంద్రుడు రాజులా ఉంటాడు. అందుకే చంద్రుడిని 'రేరాజు' అంటారు. చల్లని వెన్నెలలో పిల్లలు చక్కగా ఆడుకుంటారు.

చంద్రుడు కొన్ని రోజులు పెరుగుతూ, మరికొన్ని రోజులు తగ్గుతూ ఉంటాడు. వీటినే చంద్రకళలు అంటారు. చంద్రుడు పెరుగుతూ ఒక రోజు నిండుగా, పెద్దగా కనిపిస్తాడు. ఆ రోజు పండు వెన్నెలఉంటుంది. ఆ రోజును పున్నమి లేదా పౌర్ణమి అంటారు. చంద్రుడు రోజు రోజుకు తగ్గుతూ చివరకు అసలు కనిపించడు. ఆ రోజును అమావాస్య అంటారు.



చల్లని జాబిల్లి అంటే అందరికీ ఎంతో ఇష్టం. అందుకే చంద్రుడిని మామకాని మామ (చంద మామ) అని అంటారు.

## అభ్యాసము

**I. క్రింది ఖాళీలను సరైన పదాలతో పూరించండి.**

1. ఉదయించే సూర్యుడు పెద్దగా, .........................., .......................... ఉంటాడు.
2. సూర్యుడు .......................... దిక్కుగా వెళ్ళి అస్తమిస్తాడు.
3. చంద్రుడిని .......................... అంటారు.
4. నిండుగా చంద్రుడు కనిపించిన రోజును పున్నమి లేదా .......................... అంటారు.

**II. ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. సూర్యుడు ఏ దిక్కున ఉదయిస్తాడు ?
2. పగలు అంటే ఏమిటి ?
3. రాత్రిపూట ఆకాశంలో ఏమేమి కనిపిస్తాయి ?
4. అమావాస్య అంటే ఏమిటి ?

**III. జతపరచండి.**

| | | |
|---|---|---|
| 1. నక్షత్రాలు | (     ) | (క) పౌర్ణమి |
| 2. పడమర | (     ) | (గ) ఆకాశం |
| 3. చీకటి రాత్రి | (     ) | (చ) సూర్యుడు అస్తమించే దిక్కు |
| 4. పండు వెన్నెల | (     ) | (జ) అమావాస్య |

**IV. ఈ క్రింది వాటికి వ్యతిరేక పదాలను తెల్పుము.**

1. రాత్రి × ......................
2. తక్కువ × ......................
3. వెలుతురు × ......................
4. ఆనందం × ......................